సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9652278546

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

డీఎస్పీ విష్ణుస్వరూప్ బాధ్యతల స్వీకరణ



విష్ణు స్వరూప్‌ను అభినందిస్తున్న పోలీస్ అధికారి

పరవాడ: పరవాడ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా వి.విష్ణు స్వరూప్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన కేవీ సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ స్థానిక పరిస్థితులపై అవగాహన పెంచుకుని, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నేరాలను అదుపు చేస్తామన్నారు. ప్రజలకు పోలీసు సేవలను సమర్థవంతగా అందించేందుకు తన వంతు కృషి చేస్తానని డీఎస్పీ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన విష్ణు స్వరూప్‌ను పరవాడ, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం సీఐలు, ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

పెరిగిన ఉపాధి అవకాశాలు



శిక్షణ పొందుతున్న వారితో కైట్స్ అధినేత రామునాయుడు, ప్రశాంత్

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగులకు, మహిళలకు మంచి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కైట్స్ స్కిల్స్ సంస్థ అధినేత గొర్లె రామునాయుడు అన్నారు. ఆదివారం పెందుర్తిలోని కైట్స్ సంస్థలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్, జిల్లా కోఆర్డినేటర్లు వనజ, గౌరినాయుడు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఏఈవోకు చెక్కు అందిస్తున్న దాత నాగేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అక్కయ్యపాలేనికి చెందిన ఎస్.నాగేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందించారు. సంబంధిత చెక్కుని ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కి ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని అందించారు.

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన



క్లాత్ సంచులను ఆవిష్కరిస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆదివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. దర్శనానంతరం బయటకి వచ్చే భక్తులకు క్లాత్ సంచులు అందజేశారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు క్లాత్ సంచులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097



పరవాడలో తాళాలు వేసిన సామాజిక మరుగుదొడ్లు



వాడచీపురుపల్లిలో మూతపడిన సామాజిక మరుగుదొడ్లు

అత్యవసరమైతే.. అవస్థలే..!

- మూతపడిన పరవాడ, వాడచీపురుపల్లి సామాజిక మరుగుదొడ్లు
- వదిలించుకున్న ఎన్టీపీసీ.. వదిలేసిన పంచాయతీలు
- వారపు సంత, ఆస్పత్రికి వచ్చే వారికి ఇబ్బందులు

పరవాడ: గ్రామీణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిన సామాజిక మరుగుదొడ్లు మూతపడ్డాయి. సీఎస్సార్ నిధులు రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ మరుగుదొడ్లు నిర్వహణ లోపంతో మూడు మాసాలుగా మూలకు చేరాయి. దీంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారపు సంతకు వచ్చే ప్రజలు మరుగుదొడ్లు మూసేయడంతో.. రహదారులనే ఆశ్రయిస్తున్నారు.

రూ.33 లక్షలతో నిర్మాణం

గ్రామీణ ప్రజల సౌకర్యార్థం 2021 జూలైలో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం పరవాడ, వాడచీపురుపల్లి గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకొచ్చింది. ఒక్కోదానికి రూ.16.50 లక్షలు చొప్పున మొత్తం రూ.33 లక్షల సీఎస్సార్ నిధుల్ని వెచ్చించి, మౌలిక సదుపాయాలు కల్పించింది. పనులు పూర్తి చేసి నిర్వహణ బాధ్యతను గత మూడేళ్లుగా ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగమే చూస్తోంది. ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు నిర్వహణ బాధ్యతను తీసుకున్న ఎన్టీపీసీ యాజమాన్యం ఒక్కొక్క సామాజిక మరుగు దొడ్డి వద్ద ఇద్దరేసి పారిశుధ్య సిబ్బందిని నియమించింది. ఒక్కొక్కరికి రూ.8 వేలు చొప్పున వేతనాలను చెల్లిస్తోంది.

పంచాయతీల చేతికొచ్చాకే..

సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలను సదరు గ్రామ పంచాయతీలకు అప్పగించాలని ఎన్టీపీసీ యాజమాన్యం నిర్ణయించింది. గతేడాది చివరి త్రైమాసికంలో బాధ్యతలు తీసుకున్న పంచాయతీలు మూడు నెలల నుంచి సామాజిక మరుగుదొడ్లను తెరవట్లేదు. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు ప్రారంభమయ్యాయి. సామాజిక మరుగుదొడ్లను ఉపయోగించుకోవడం మొదలెట్టాక ఆయా గ్రామాల్లో గ్రామీణ రహదారులు, బహిరంగ ప్రదేశాలు బాగుపడ్డాయి. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వీటిని వినియోగించుకునేందుకు అలవాటుపడ్డారు. ప్రస్తుతం మరుగుదొడ్లను మూసేయడంతో రోడ్లు, బహిరంగ ప్రదేశాలనే ఆశ్రయించాల్సి వస్తోంది.

ఆస్పత్రి, సంతకు వచ్చే వారికి ఇబ్బందులు

పరవాడలో మంగళవారం జరిగే వారపు సంత రోజున ఈ మరుగుదొడ్లను ఉపయోగించుకునేవారి సంఖ్య 150కు పైగానే ఉండేదని ఇక్కడి కార్మికులు చెప్తున్నారు. వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన సామాజిక మరుగుదొడ్డి కూడ మూత పడడంతో స్థానికులతో పాటు ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు, ఇతర ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. వీటిని మూసేశాక ఇక్కడి రోడ్లు దారుణంగా మారి, రాకపోకలు సాగించే ప్రజలు ముక్కులు మూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

కాలకృత్యాలకు ఇబ్బంది



పరవాడ సామాజిక మరుగుదొడ్డి మూడు నెలలుగా మూత పడడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో సామాజిక మరుగుదొడ్లతో సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం మరుగుదొడ్డి మూత పడడంతో స్థానికులు రోడ్లు, బహిరంగ ప్రదేశాలను బహిర్భూమిగా ఉపయోగిస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాలు అధ్వానంగా మారుతన్నాయి. ముక్కు మూసుకుని రోడ్లపై ప్రయాణించాల్సి వస్తోంది.

– అండిబోయిన ఆదేశ్వరరావు, పరవాడ

మరుగుదొడ్లు తెరవాలి



వాడచీపురుపల్లిలో మూతపడిన సామాజిక మరుగుదొడ్డిని వెంటనే తెరవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రయాణికులు, ఆస్పత్రికి వచ్చే ప్రజలకు ఇక్కడ ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి ఉపయోగకరంగా ఉండేది. కొంత కాలంగా మరుగుదొడ్డిని మూసివేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యలను గుర్తించి మూత పడిన మరుగుదొడ్డిని తెరవడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి.

– జి.బాబూరావు, వాడచీపురుపల్లి

ఉపాధి కోల్పోయాం



మరుగుదొడ్లు మూత పడడంతో మూడు మాసాలుగా ఉపాధి లేక కుటుంబాలు పస్తులుంటున్నాయి. ఎన్టీపీసీ పుణ్యమా అని మూడేళ్ల నుంచి మరుగు దొడ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ఉన్నట్టుండి మరుగుదొడ్లను అకస్మాత్తుగా మూసేయడంతో తిండి కష్టాలు మొదలయ్యాయి. పరవాడ, వాడచీపురుపల్లి గ్రామాల్లో మూతపడిన మరుగుదొడ్ల కారణంగా నాలుగు కుటుంబాలు ఉపాధికి దూరమై, అలమటిస్తున్నాయి.

– వడిశెల బంగారుబాబు, పారిశుధ్య కార్మికుడు, పరవాడ

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం



ఏఐవైఎఫ్ పతాకావిష్కరణ చేస్తున్న ప్రతినిధులు

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం నిరుపేదల బతుకులపై భారం మోపి, కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు విమర్శించారు. ఏఐవైఎఫ్ విశాఖ జిల్లా నిర్మాణ మహాసభ ఆదివారం పెందుర్తిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ దేశ సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నాయన్నారు. యువతకు 2 కోట్ల ఉద్యోగాలని మభ్యపెట్టి గద్దెనెక్కిన ప్రధానమంత్రి మోదీ, యువతను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. దేశ జీడీపీ వృద్ధిరేటు క్షీణిస్తున్నా తప్పుడు ప్రచారాలతో దేశం అభివృద్ధి చెందిందని ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. వచ్చే నెల 6, 7, 8, 9 తేదీల్లో శ్రీకాకుళంలో తలపెట్టిన ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల్లో దేశం, రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక పాలన, యువతకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తనున్నట్లు ప్రకటించారు. మహాసభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా ఏఐవైఎఫ్ పతాకావిష్కరణ చేశారు. సంఘం నేతలు ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి, కె.అచ్యుత్, వై.రాంబాబు, కె.సందీప్, యు.నాగరాజు, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

పెందుర్తి: స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి నిమిత్తం మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ ఉత్తీర్ణత కలిగి, 18–35 ఏళ్ల మధ్య వయస్సువారు. ఇంటర్వ్యూలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 77025 06614 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్ల, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

పరమపదవాసునిగా అప్పన్న

ముగిసిన రాపత్తు ఉత్సవాలు



పరమపదవాసునిగా అప్పన్న



కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవంలో భాగంగా ఆలయంలో పరమపదోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పరమపదవాసునిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆలయ ఆస్థాన మండపంలో కొలువుంచి, ద్వాదశ ఆరాధనలతో కొలిచారు. సింహగిరి మాడ వీధిలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేష హారతులు అందించారు.

అమిత్‌షాకు రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కులేదు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

సబ్బవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు లేదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆక్షేపించారు. సబ్బవరంలోని సాయినగర్ ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి అధ్యక్షతన ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ కేంద్రమంత్రి వర్గం నుంచి అమిత్‌షాను తొలిగించాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలన్నారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు నష్టం కలిగించేలా బీజేపీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి, పదవీ బాధ్యతలు చేపట్టిన అమిత్‌షా రాజ్యాంగ దినోత్సవం రోజునే అంబేడ్కర్‌ను అవమానించారన్నారు. నిరసనలో ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ తోపుడుబండ్ల సంఘం అధ్యక్షులు ఎం.గౌరేష్, యర్ర సోంబాబు, గవర రామునాయుడు, ఉడి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు





కప్పస్తంభానికి మొక్కుకుంటున్న గణబాబు, బేడా మండపంలో ప్రదక్షిణ చేస్తున్న కేఎస్ఎన్ఎస్ రాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ గణబాబు, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అయ్యప్పస్వామి

పెందుర్తి: సుజాతనగర్లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మ శాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామివారి ఉత్తరా నక్షత్రాన్ని పురష్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పకు పంచామృతాభిషేకం జరిగింది. అనంతరం విశేషాలంకరణలో స్వామి పూజలందుకున్నారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా సీతారాముల తీర్థమహోత్సవాలు



గొటివాడలో సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం: మండలంలో పలు గ్రామాల్లో సీతారాముల తీర్థమహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. జీవీఎంసీ పరిధిలోని గంగవరంలో, మండలంలోని గొటివాడలో సీతారాముల తీర్థ మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గొటివాడలో స్వామివారిని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా సత్యారావు, ఎంపీటీసీ బొండా శేషుకుమారి, మాజీ సర్పంచ్ వడిశల రమేష్ తదితరులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం

పెందుర్తి: స్థానిక సూర్యనారాయణమూర్తి దేవాలయంలో సప్తస్వరాల సంగీత అకాడమీ ఆధ్వర్యంలో 178వ త్యాగరాజ ఆరాధన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆదిత్యునికి ప్రత్యేక పూజలు జరిపారు. సప్తస్వరాల సంగీత అకాడమీ ప్రతినిధి కొత్తపల్లి భానుమతి ఆధ్వర్యంలో ఆలపించిన త్యాగరాజ కీర్తనలు ఆహూతుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

అసలే చీకటి.. ఆపై గోతులు!

- ఏడాదిగా వెలగని హైమాస్ట్ లైట్



దేశపాత్రునిపాలెం వంతెన కూడలిలో వెలగని హైమాస్ట్ లైట్

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారి దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ ఏడాది కాలంగా మరమ్మతులకు గురైంది. దీంతో కటిక చీకటిలోనే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రహదారి మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు కూడలిలో పాన్ షాపులు, మాంసం, చేపల దుకాణదారులు రాత్రుళ్లు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఈ రోడ్డులో తిరిగే బూడిద లారీల కారణంగా కూడలి రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో రాత్రుళ్లు వాహనాలపై వచ్చేవారు గోతులు కానక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజల ఇబ్బందుల్ని గుర్తించి, జీవీఎంసీ అధికారులు కూడలి రోడ్డుతోపాటు, హైమాస్ట్ లైట్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు, దుకాణ యజమానులు కోరుతున్నారు.

మురుగు కాలువతో ఇబ్బందులు



దుర్వాసన, రోగాలకు కారణమైన మురుగు కాలువ

పరవాడ: ఎన్టీపీసీ దీపాంజలినగర్ టౌన్‌షిప్ నుంచి దలాయిపాలెం మీదుగా ఏర్పాటు చేసిన కాలువతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు దలాయిపాలెం, పోలిరెడ్డిపాలెం గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 27 ఏళ్ల క్రితం దీపాంజలినగర్‌లో ఎన్టీపీసీ ఉద్యోగులకు కోసం టౌన్‌షిప్ క్వార్టర్స్‌ను నిర్మించారు. వీటి ద్వారా విడుదలవుతున్న మురుగునీరు టౌన్‌షిప్ నుంచి పోలిరెడ్డిపాలెం మీదుగా ఏర్పాటు చేసిన కాలువ ద్వారా దలాయిపాలెం దరి కొత్త చెరువులోకి ప్రవహిస్తోంది. ఈ కాలువను చాలా కాలం నుంచి అభివృద్ధి చేయకుండా వదిలేశారు. కాలువ ద్వారా ప్రవహిస్తున్న మురుగు కారణంగా దోమలు విజృంభించడమే కాకుండా భరించలేని దుర్వాసన వస్తోందని, తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువను అభివృద్ధి చేసి ఎప్పటికప్పుడు దోమల నివారణ మందులను పిచికారీ చేయాలని కోరినా, ఎన్టీపీసీ అధికారులు కనీసం స్పందించట్లేదని జనసేన నాయకుడు వెలుగుల అనిల్‌కుమార్ ఆరోపించారు. ఇరు గ్రామాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఎన్టీపీసీ కాలువను అభివృద్ధి చేయకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

రామకోటి పుస్తకాల పంపిణీ



భక్తులకు రామకోటి పుస్తకాలను అందిస్తున్న రామకోటి సేవా సంఘం ప్రతినిధి బాబూరావు

పరవాడ: దేవాలయం కేంద్రంగా వారానికి రెండు రోజులు పారాయణ, భజన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని రామకోటి సేవా సంఘం ప్రతినిధి ఎం.బాబూరావు పిలుపునిచ్చారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ రామాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రామాయణంలో రాముడు మనిషిగా జన్మించి, మనుషులు ఏ విధంగా జీవించాలో లోకానికి చాటిచెప్పారన్నారు. పిల్లలు తల్లిదండ్రులను ఎలా గౌరవించాలో కూడా రాముడి జీవితం ఆదర్శమన్నారు. అనంతరం భక్తులకు రామకోటి పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకోటి సభ్యులు యు.తిరుపతిరావు, కె.వెంకటరావు, జె.రమేష్, మాతృమూర్తులు వి.అమ్మాజి, పి.చిట్టెమ్మ, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, సూరిబాబు, జగదీష్, అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనాథలా.. ఆపద్బాంధవి



'ఆపత్కాలంలో ఒకటీ.. సున్నా.. ఎనిమిదికి కాల్ చేస్తే.. కుయ్.. కుయ్.. అంటూ మీ వద్దకు వచ్చి, అవసరమైన ప్రథమ చికిత్స చేసి, దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్చి మెరుగైన వైద్యం అందించడం ద్వారా ప్రాణాలు నిలుపుతుంది' అంటూ దివంగత మహానేత వైఎస్సార్ 108 వాహనాలను ప్రవేశపెట్టి.. ప్రజలకు చెప్పిన మాటలు ఇంకా చెవుల్లో రింగుమంటూనే ఉన్నాయి. ప్రస్తుత కూటమి పాలనలో 108 వాహనాల తీరు ఏ స్థితికి చేరుకుందో తెలుసుకోవాలంటే.. వేల మాటలక్కర్లేదు.. ఈ ఒక్క ఫొటో చూస్తే చాలు! పెందుర్తి మండలం దిబ్బపాలెంలో ఓ టింకరింగ్ వర్క్‌షాప్ వద్ద 108 వాహనం నిరుపయోగంగా పడివుంది. ప్రమాదానికి గురైందో.. మరేం జరిగిందోగానీ.. మరమ్మతులు చేపట్టకుండా ఇలా రోడ్డు పక్కన వదిలేశారు. - పెందుర్తి

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com